పది రోజులుగా నిలిచిన చెత్త సేకరణ

బీరోలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
డీజిల్ లేక పంచాయతీ ట్రాక్టర్ నిలిచిన ఫలితం
ఎంపీడీవో శిలార్‌సాహెబ్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

బీరోలులో వీధుల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 1 : మండలంలోని బీరోలు పంచాయతీలో 10 రోజులుగా చెత్త సేకరణ నిలిచి పోయింది. డీజిల్ లేని కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బయటకు తీయడం లేదు. దీంతో వీధుల్లో ఎక్కడి చెత్తాచెదారం అక్కడే పేరుకుపోయింది. ఆ చెత్త కుప్పల నుంచి దుర్వాసన వస్తుండడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని మాజీ వార్డు సభ్యుడు బత్తుల జగన్‌మోహన్ సహా పలువురు గ్రామస్తులు ప్రశ్నించగా.. డీజిల్ కొనుగోలు చేసేందుకు పంచాయతీలో నిధులు లేక పోవడంతో ట్రాక్టర్‌ను బయటకు తీయడం లేదని చెప్పారు. ఈ విషయమై మరికొందరు గ్రామస్తులు ఎంపీడీవో శిలార్‌సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, గత కేసీఆర్ ప్రభుత్వంలో పంచాయతీ ట్రాక్టర్లు గ్రామంలో ప్రతిరోజూ తిరుగుతూ వీధుల్లోని చెత్తను తీసుకెళ్లి డంపింగ్‌యార్డుల్లో పోసేవని, అప్పుడు వీధులు శుభ్రంగా ఉంటూ వ్యాధులు వ్యాపించేవికావని గ్రామస్తులు గుర్తుచేసుకుంటున్నారు.

నిధులు లేని విషయం వాస్తవమే..

బీరోలు పంచాయతీ ట్రాక్టర్‌లో పోసేందుకు డీజిల్ కొనుగోలుకు నిధులు లేని మాట వాస్తవమే. బీరోలు సంత వేలం నగదు ట్రెజరరీలో జమ కాలేదు. మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కూడా డీజిల్ కొనేందుకు నిధులు లేవు. బీరోలు పంచాయతీ కార్యదర్శితో చర్చించి చెత్త సేకరణను పునరుద్ధరిస్తాం.
– ఎంపీవో సూర్యనారాయణ

బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు

రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీలో అధికారులు

సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న డీఎస్‌వో చందన్‌కుమార్

బోనకల్లులో ప్రారంభిస్తున్న తహసీల్దార్

కూసుమంచి/ కూసుమంచి (నేలకొండపల్లి)/ బోనకల్లు/ మధిర (చింతకాని)/ ఎర్రుపాలెం/ తిరుమలాయపాలెం, మార్చి 1 : ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీలో డీలర్లు పూర్తిగా బాధ్యత వహించాలని సూచించారు. పాలేరు, మధిర నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డులున్న పేదలకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నందున అన్ని చౌకదుకాణాలపైనా నిఘా ఉంటుందని అన్నారు. కూసుమంచిలో తహసీల్దార్ కరుణశ్రీ, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, బోనకల్లులో తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, చింతకానిలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎర్రుపాలెంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, నేలకొండపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నెపూసల సీతారాములు, తిరుమలాయపాలెంలో పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేశ్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి
డీఎస్‌వో చందన్‌కుమార్

రఘునాథపాలెం, ఏప్రిల్ 1 : రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా అందించే సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మంజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం ఖమ్మం నగరం 16వ డివిజన్ పరిధిలోని రేషన్‌షాపులో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని మేయర్ నీరజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ఏ కార్డుదారుడైనా నివాసం ఉండే ప్రాంతంలోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఖమ్మంరూరల్ సివిల్ సప్లై డీటీ విజయ్‌బాబు, ఖమ్మంజిల్లా రేషన్‌డీలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జానీమియా, నగర అధ్యక్షుడు ఇబ్రహీం, ఆర్ఐ జావీద్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 1 : గత నెల 27వ తేదీన జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తొండపు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షురాలిగా మోతూకూరి విజయశాంత, జాయింట్ సెక్రటరీగా ఎం.నవీన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్.రాంబాబు, క్రీడల కార్యదర్శిగా కేవీవీ లక్ష్మి, కోశాధికారిగా పి.నరసింహారావు, మహిళ ప్రతినిధిగా పి.ఇందిర బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జూనియర్, సీనియర్ న్యాయవాదులు, లీగల్ కంట్రీబ్యూటర్లు పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' గడువు పొడిగింపు

మామిళ్లగూడెం, ఏప్రిల్ 1 : రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ నిరుద్యోగ యువత ఏప్రిల్ 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 21 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, కుటుంబంలో ఒక్కరి మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని సూచించారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు యూనిట్ గ్రౌండింగ్‌తోపాటు వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన శిక్షణ అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

భారతి సేవలు అభినందనీయం

మామిళ్లగూడెం, ఏప్రిల్ 1 : సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహం(ఏ)లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన చిన్నపొంగు భారతి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం ఆ వసతిగృహంలో వసతిగృహ సంక్షేమాధికారి విజయ అధ్యక్షతన ఆమెను సన్మానించారు. ఎస్సీ డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ భారతి 39ఏళ్లపాటు నిజాయితీగా పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, శ్రీకాంత్, లలితకుమారి, రాధికరెడ్డి, రుక్మారావు, కోడి లింగయ్య, బిక్కు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేటినుంచి జేఈఈ రెండోవిడత పరీక్ష

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 1 : దేశవ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ నెల 2, 3, 4, 7, 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న రెండోవిడత జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ రామసహాయం పార్వతిరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలుగా బొమ్మ, శ్రీచైతన్య, ఎస్‌బీఐటీ, విజయ ఇంజినీరింగ్ కళాశాలలను ఎంపిక చేశారు. 4 కేంద్రాల్లో మొదటి మూడురోజులు జరిగే పరీక్షలకు 3,095 మంది హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఉంటుందని వివరించారు.

నేటితో ముగియనున్న టెన్త్ పరీక్షలు

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 1 : పదో తరగతి పరీక్షలు బుధవారం జరిగే సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. ఈ పరీక్షకు ఇన్‌చార్జి డీఈవోగా డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ వ్యవహరించనున్నారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పరీక్షల నిర్వహణపై సూచనలు చేయనున్నారు. సైన్స్ పరీక్షలో సమాధాన పత్రాల తరలింపులో చోటుచేసుకున్న సంఘటనల దృష్ట్యా చివరి పరీక్ష కావడంతో అందరిని అప్రమత్తం చేయనున్నారు.

యువ వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మధిర మండల పర్యటనలో అదనపు కలెక్టర్ శ్రీజ

దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర, ఏప్రిల్ 1 : అర్హులైన యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పీ.శ్రీజ సూచించారు. మధిర మండలంలో మంగళవారం పర్యటించిన ఆమె.. దెందుకూరు గ్రామంలో దరఖాస్తుల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులతో మాట్లాడుతూ.. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం గడువు పొడిచించినట్లు చెప్పారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత మంజూరుపత్రాలు జారీ చేయనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులకు వ్యాపార నిర్వహణపై శిక్షణ కూడా అందిస్తామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ నవీన్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రైతుల ధర్నా

కొత్తకారాయిగూడెంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు

పెనుబల్లి, ఏప్రిల్ 1 : రోడ్డు నిర్మాణానికి వ్యవసాయ భూములు ఇచ్చినప్పటికీ తమ పంట పొలాల్లోకి సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో ఆగ్రహించిన పెనుబల్లి మండలం కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన రైతులు ప్రధాన రహదారిపై మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి రెండు పంటలు పండే భూములు ఇస్తే.. తమ పొలాల్లోకి వెళ్లేందుకు అండ్ పాస్ ఇవ్వకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. యాసంగిలో వరి పొలాలు కోతకు రావడంతో కోత యంత్రాలు వెళ్లేందుకు కనీసం రోడ్డు మార్గం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దొడ్డపునేని రవి, ప్రసాద్, కే.నరసింహారావు, కృష్ణ, ఎం.శ్రీను, నీలకంఠం, సూరయ్య, కేశవరావు, వంశీ, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

కిష్టారం ఓసీలో మజ్జిగ పంపిణీ

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 1: కొత్తగూడెం ఏరియా పరిధిలో సత్తుపల్లి మండలంలోని కిష్టారం ఓపెన్‌కాస్ట్‌లో మంగళవారం వేసవి దృష్ట్యా ఉద్యోగుల సంక్షేమం కోసం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిష్టారం ప్రాజెక్టు అధికారి ఎం.వీ.నరసింహారావు మాట్లాడుతూ.. వేసవిలో డీహైడ్రేషన్ కాకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, తరచుగా నీళ్లు తాగుతూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కిష్టారం ప్రాజెక్టు అధికారి ఎం.వీ.నరసింహారావు, కాలనీ మేనేజర్ రామకృష్ణ, రక్షణ అధికారి గోపికిషోర్, ఏఐటీయూసీ ప్రతినిధి సాంబశివరావు, ఐఎన్‌టీయూసీ ప్రతినిధి రాజేశ్వరరావు, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీ ఉద్యోగులకు అభినందనలు


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 1: సత్తుపల్లి సింగరేణి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ సింగరేణిలో అత్యధికంగా ఉత్పత్తి సాధించిన ఉద్యోగులను అభినందిస్తూ యాజమాన్యం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ ప్రతినిధులుగా బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ నాగప్రకాష్, ఫిట్ సెక్రటరీ రామారావు మాట్లాడుతూ.. సింగరేణిలో సమష్టి కృషితో ఉత్పత్తి సాధించిన అధికారులు, ఉద్యోగులకు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ ప్రసాద్, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ తరపున శుభాకాంక్షలు తెలిపారు. ప్రహ్లాదా, శ్రీనివాసరావు, బెజ్జంకి రాజేశ్వరరావు, దుర్గాప్రసాద్, దేవదాసు, రమాకాంత్, భాస్కర్‌రావు, అఖిల్, విక్రమ్‌బాబు, గోవిందు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ పాదయాత్ర

పాదయాత్రగా వెళ్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మంఅర్బన్, ఏప్రిల్ 1 : పీఆర్‌టీయూ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడం పట్ల పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. మంగళవారం ఖమ్మం ఇందిరానగర్‌లోని వినాయకస్వామి ఆలయం నుంచి 23మంది వైరాలోని పాత శివాలయానికి పాదయాత్ర చేశారు. సీతారామయ్య, నాగేశ్వరరావు, సురేష్, భిక్షం, సతీష్, రత్నకుమార్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై కార్పొరేటర్ల ఆగ్రహం

రఘునాథపాలెం, ఏప్రిల్ 1 : రేషన్‌షాపుల ద్వారా ఏప్రిల్ 1వ తేదీ నుంచి సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. అయితే ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయకుండానే పంపిణీ చేపట్టడంపై కార్పొరేటర్లు గుర్రుగా ఉన్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఏ ఒక్క రేషన్‌షాపులోనూ కార్పొరేటర్లను ఆహ్వానించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు'

పెనుబల్లి, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ హైదరాబాద్ వెళ్లడానికి బయలుదేరిన సీపీఎం నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు జరిపే నిరసనకు సీపీఎం, ఎస్ఎఫ్ఐ మద్దతు ప్రకటించింది.

గ్రూప్- 1 సాధించిన ప్రమోద్‌సాయి

అమ్మతో గ్రూప్-1 సాధించిన తాటి ప్రమోద్ సాయి

సత్తుపల్లిటౌన్, ఏప్రిల్ 1: అమ్మకు తన కొడుకు సివిల్ సర్వెంట్ కావాలని కోరిక మేరకు గ్రూప్– 1 సాధించి అమ్మ కోరిక నెరవేర్చాడు కొడుకు ప్రమోద్ సాయి. వీరి స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని తాటి సుబ్బన్నగూడెం కాగా విద్యాభ్యాసం సత్తుపల్లిలోనే కొనసాగింది. తల్లి తాటి సుదర్శనమ్మ టీచర్‌గా పనిచేస్తుంది. తండ్రి తాటి రామచంద్రరావు చనిపోయాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో 464 మార్కులు సాధించి రాష్ట్ర ర్యాంకు 317 కాగా, ఎస్టీ సామాజిక వర్గంలో జోన్–1లో 10వ ర్యాంకు సాధించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేంసూరు, ఏప్రిల్ 1: వేంసూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంటపాడు, చౌడవరం గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు 11 కే.వీ. మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ అంకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాపాలన అంటే నిర్బంధమేనా..!

సీపీఎం నేత బొంతు రాంబాబు


అరెస్ట్ చేసిన దృశ్యం

వైరాటౌన్, ఏప్రిల్ 1: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు స్వాధీనం చేసుకోవడాన్ని నిరసన తెలిపేందుకు సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వడంతో మంగళవారం వైరా పోలీసులు సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, తోట నాగేశ్వరరావు, తోట కృష్ణవేణిను ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ప్రజాపాలన అంటే నిర్బంధమేనా అని, యూనివర్సిటీ భూములు రాష్ట్ర ప్రభుత్వం విక్రయం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీసాహితికి సన్మానం

సన్మానిస్తున్న దృశ్యం

వైరాటౌన్, ఏప్రిల్ 1: వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంగెపు వెంకటేశ్వర్లు, కవిత దంపతులకు కూతురు లక్ష్మీసాహితి గ్రూప్ వన్ ఫలితాల్లో 129వ ర్యాంకు సాధించింది. వైరాకు చెందిన వజినేపల్లి చక్రవర్తి మంగళవారం వారి ఇంటికి వెళ్లి లక్ష్మీసాహితిని శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో గుమ్మడిదల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి : ఎమ్మెల్యే


సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కారేపల్లి, ఏప్రిల్ 1: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని మండలంలోని భాగ్యనగర్ తండాలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ముంపు బాధితుల ఇంటి పన్ను రద్దు చేయాలి'

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 1: మున్నేటి వరదల ముంపు బాధితుల ఇంటి పన్నులు రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నందిగామ కృష్ణ మాట్లాడుతూ.. నిరుటి మున్నేటి వరదల్లో దాని సమీప ప్రాంతాల ప్రజలు సర్వస్వం కోల్పోయినందుకు వారి ఇంటి పన్నులను రద్దు చేయాలని కోరారు. అలాగే, తీగల వంతెన కారణంగా నిరాశ్రయులైన వారికి, వరద బాధితులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీ నాయకులు ఏటుకూరి ప్రసాద్, ఆంటోని, నూకల బాలరాజు, శ్రీనివాసరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన ప్రభుత్వంపై పోరాడాలి: సీపీఐ

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 1: పేదల సమస్యల పరిష్కారం కోసం వారి పక్షాన నిలుస్తూ ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని సీపీఐ నేతలు మహ్మద్ మౌలానా, దండి సురేశ్ పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో వారు మాట్లాడారు. పేదల పక్షాన నిలిచేది సీపీఐ మాత్రమేనని అన్నారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ప్రకటించారు. నాయకులు రెంటాల శ్రీరాములు, పుచ్చకాయల సుధాకర్, దండి రంగారావు, జానిమియా, రాము, మిడకంటి చిన్న వెంకటరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

'ఏదులాపురం' అభివృద్ధికి రూ.90.50 లక్షలు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 1: ఇటీవల ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.90.50 లక్షల నిధులను మంజూరి చేసింది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో సుడా నుంచి ఈ నిధులు విడుదలైనట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. తాగునీటి కల్పన కోసం రూ.50 లక్షలు, డివిజన్ల సుందరీకరణ, డివైడర్ల మధ్య మొక్కల పెంపకం కోసం రూ.15.50 లక్షలు, శానిటైజేషన్, వీధిలైట్ల కోసం రూ.25 లక్షలు కేటాయించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్: సీపీఎం

బోనకల్లు, ఏప్రిల్ 1: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పరిపాలన చేస్తున్నారని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి భాస్కర్‌రావు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌సీయూ యూనివర్సిటీ భూముల వేలం ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాలని ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు అక్రమ అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. సీపీఎం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్, బోయినపల్లి వీరబాబు, గుగులోతు నరేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువుల్లో సత్తాచాటిన అన్నాచెల్లెలు

ఉద్యోగం సాధించిన అన్నాచెల్లెలు దేవిశెట్టి రాజేష్, ప్రవళిక

మధిర, ఏప్రిల్ 1: మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు గ్రామానికి చెందిన దేవిశెట్టి కృష్ణ, పద్మ దంపతుల కుమారుడు, కుమార్తె ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కుమార్తె దేవిశెట్టి ప్రవళిక గ్రూప్–2లో ప్రతిభ చూపి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. సోదరుడు దేవిశెట్టి రాజేశ్ ఐబీపీఎస్ పీవో, క్లర్క్ ఉద్యోగాలు సాధించాడు. ఈ అన్నాచెల్లెలును పట్టణ ప్రముఖులు మంగళవారం అభినందించారు.

'13న వైరాలో టీయూసీఐ జిల్లా మహాసభ'

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 1: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా మహాసభను ఈ నెల 13న వైరాలో నిర్వహించనున్నట్లు సంఘం నాయకుడు గోసు పుల్లయ్య తెలిపారు. మండలంలోని పిండిప్రోలులో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మీగడ సైదులు, కత్తుల భిక్షం, ఏసు, నగండ్ల పుల్లయ్య పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నిందితుడికి రిమాండ్

రఘునాథపాలెం, ఏప్రిల్ 1 : జల్సాలకు అలవాటు పడి చోరీలు, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. భద్రాచలం ప్రాంతానికి చెందిన కోడి శంకర్ అలియాస్ జంపన్న చోరీలకు పాల్పడుతూ ఖమ్మంలో నివాసముంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా వన్‌టౌన్, టూటౌన్, ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 9 దొంగతనాలు చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుడి వద్ద నుంచి 10 తులాల బంగారం, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ హరికృష్ణ, బోరయ్యను సీపీ అభినందించారు.

చెరువులో మునిగి తండ్రీకొడుకు మృతి

బోనకల్లు, ఏప్రిల్ 1: చెరువులో మునిగి తండ్రీ, కొడుకు మృత్యువాత పడిన ఘటన మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పఠాన్ యూసూఫ్‌మియా(65) మతిస్థిమితం కోల్పోయి ఇంటి సమీపంలోని ఊర చెరువులోకి దిగాడు. గమనించిన కొడుకు పఠాన్ కరీముల్లా(45) తండ్రిని కాపాడేందుకు తాను చెరువులోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ చెరువులో మునిగి మృతిచెందారు. స్థానికులు గుర్తించి మృతదేహాలను బయటకు తీశారు. అప్పటి వరకు గ్రామంలో రంజాన్ పండుగ ఆనందంలో ఉన్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి. యూసూఫ్ మియాకు భార్య, ముగ్గురు కుమారులు. కరీముల్లాకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

బోనకల్లు, ఏప్రిల్ 1: రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన ఘటన బోనకల్లు రైల్వేస్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కర్రి శ్రీనివాసరావు కథనం ప్రకారం.. 30 ఏళ్ల వయసు గల ఓ గుర్తుతెలియని యువకుడు బోనకల్లు రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై పడి ఉన్నాడు. రైల్వే అధికారుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఖమ్మం అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో ఆ యువకుడి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తనికెళ్లలో వెంకటలాలయ్య వర్ధంతి

కొణిజర్ల, ఏప్రిల్ 1: మండల పరిధిలోని తనికెళ్లలో సీపీఐ నాయకుడు యాస వెంకటలాలయ్య వర్ధంతిని మంగళవారం తనికెళ్ల గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు పార్టీ జెండా ఎగురవేసి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు దండి సురేష్, యర్ర బాబు, దొండపాటి రమేష్, పీ.వీ.రావు, తాటి వెంకటేశ్వరరావు, కొణపర్తి విష్ణుమూర్తి, ఎల్.గోపాలరావు, యాస వెంకటేశ్వరరావు, యాస సత్యనారాయణ, పాపిట్ల యేసు, భరత్, ప్రసాద్, షేక్ రంజాన్, వెంకటలాలయ్య పాల్గొన్నారు.

యూసుఫ్‌ఖాన్, కరీముల్లాకు నివాళి

బోనకల్లు, ఏప్రిల్ 1: మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన పఠాన్ యూసుఫ్‌ఖాన్, పఠాన్ కరీముల్లాఖాన్ సోమవారం ప్రమాదవశాత్తూ స్థానిక చెరువులో పడి మృతి చెందారు. వారి మృతదేహాలను ముస్లిం ఐక్య సంఘం నాయకుడు మహబూబ్‌పాషా, మాజీ జడ్పీటీసీ బాణోతు కొండా తదితరులు మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ముస్లిం ఐక్యసంఘం నాయకులు చాంద్‌సాహెబ్, జానిమియా, దస్తగిరి, రమేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

శంకర్‌రావుకు పరామర్శ

పెనుబల్లి, ఏప్రిల్ 1: మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తాళ్లూరి శేఖర్‌రావు ఇటీవల అనారోగ్యానికి గురై ఖమ్మంలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.